ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 1: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 25 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు పేర్కొన్నారు. జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా మండలాల్లోని ఇంటర్ పరీక్షా కేంద్రాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీవోలు తమ పరిధిలోని కేంద్రాలను విధిగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

భెల్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

రామచంద్రాపురం, మార్చి 1: భెల్ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ సంస్థ సహకారంతో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో అనేక కంపెనీలు పాల్గొన్నాయి. సుమారుగా 100 కుపైగా అభ్యర్థులు మేళాలో పాల్గొన్నారు. 20కిపైగా అభ్యర్థులు స్పాట్ సెలక్షన్‌లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కవిత మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం చాలా సంతోషంగా ఉన్నదని తెలిపారు. భెల్ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ సంస్థ వారు మెగా జాబ్‌మేళాను నిర్వహించడం విద్యార్థులతో పాటు పలువురికి దోహదపడిందని చెప్పారు. జాబ్‌మేళాతో విద్యార్థులకు సమాజంలో ఉద్యోగాలకు ఉన్న డిమాండ్ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అందోల్, మార్చి 1: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జోగిపేట ఎస్సై పాండు శనివారం తెలిపారు. అందోల్‌కు చెందిన కుంటి నాని(25) శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జోగిపేట ఎస్సై పాండు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవఖానాకు తరలించి..భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోతోసింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న సీఎఫ్‌వో గౌతమ్

లోటస్ పరిశ్రమ ప్రతినిధికి అవార్డు

హత్నూర, మార్చి 1: లోటస్ చాక్లెట్ పరిశ్రమ సీఎఫ్‌వో గౌతమ్ ప్రతిష్ఠాత్మకమైన ఎంఎస్ఎంఈ అవార్డు అందుకున్నట్లు పరిశ్రమ ప్రతినిధి నాగరాజు తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో అసోచామ్ 3వ ఎడిషన్ వైబ్రెంట్ సీఎఫ్‌వో సమ్మిట్ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించగా ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోతోసింగ్ చేతులమీదుగా అవార్డు పొందినట్లు తెలిపారు. రిలయన్స్ అనుబంధ సంస్థ అయినటువంటి లోటస్ చాక్లెట్ కంపెనీ సీఎఫ్‌వో గౌతమ్‌కు సీఎఫ్‌వో ఆఫ్ ది ఇయర్ ఎంఎస్ఎంఈ రెండోసారి అవార్డు అందుకోవడంతో సమ్మిట్ నిర్వాహకులు పరిశ్రమ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

సదాశివపేట, మార్చి 1:మండలంలోని తంగెడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా అరుణ్, డీఈవోగా చరణ్‌తేజ, ఎంఈవోగా సుమంత్, పీఈటీగా నరేశ్, సీఆర్‌పీగా సాయిచరణ్, ఆఫీస్ సబార్డినేట్‌గా నక్షిత్, ఉపాధ్యాయులుగా మాధవి, నిహారిక, నవ్యశ్రీ, ప్రియాంక, హారిక, వైష్ణవి, సౌమ్య వ్యవహరించారు.

జహీరాబాద్, మార్చి 1: న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులు పాఠాలు బోధించారు. విద్యార్థులను మండల విద్యాధికారి మారుతీరాథోడ్, హెచ్ఎం అమృత్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్నూర, మార్చి 1: హత్నూర మండలం కొన్యాల ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

జిన్నారం మార్చి 1: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్, డీఈవో, ఎంఈవోల పాత్రల్లో విద్యార్థులు చక్కగా రాణించి ప్రతిభ చాటారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

సరిపోను కరెంటు లేక ఎండుతున్న పంటలు

హత్నూర, మార్చి 1: సరిపోను కరెంటు సరఫరా కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయలు ఖర్చుచేసి వరి సాగు చేస్తే సరిపోను కరెంటు రాకా పంటలు ఎండుతున్నాయని వాపోతున్నారు. హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన చాకలి సుభాశ్ గ్రామ శివారులో ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. పంట పెరుగుతున్న తరుణంలో కరెంటు సమస్య తలెత్తి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బోరుళఓ పుష్కలంగా నీరున్నా కరెంటు సమస్య వేధిస్తుండటంతో ఏమిచేయాలో తెలియడంలేదంటున్నాడు. 22 బోరు మోటార్లకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో తరచూ కరెంటు తీగలు తెగిపోవడం లేదా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం జరుగుతుందన్నాడు. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని డీడీ చెల్లించి నెల రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించాడు. కరెంటు సమస్య పరిష్కరించాలని లైన్‌మెన్ వద్దకెళితే రైతులంతా మాట్లాడుకుని రోజుకు కొందరు రైతులచొప్పున నీరు పారించుకోవాలని సమాధానం ఇస్తున్నట్లు తెలిపాడు. రైతులకు ఎదురవుతున్న కరెంటు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాడు. పుష్కలంగా నీరున్నా కండ్ల ఎదుట పంట ఎండిపోతే కుటుంబం రోడ్డునపడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

కాసాల శివారులో సరిగా కరెంట్ రాకా ఎండిన వరి పొలం

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అల్మాయిపేట్ రైతులు

సాగునీరందించాలని రైతుల వినతి

అందోల్, మార్చి 1: అల్మాయిపేట్ పెద్దచెరువు కాల్వలో పూడికతీసి సాగునీరందించాలని రైతులు శనివారం తహసీల్దార్ విష్ణుసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్మాయిపేట్‌కు వచ్చే వరద కాల్వను పక్క గ్రామస్తులు ధ్వంసం చేయడంతో సాగునీరు రాక పొలాలు ఎండుతున్నాయని, బోర్లలో సైతం నీళ్లు రావడం లేదన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. త్వరలో వరద కాల్వలో పూడిక తీసే పనులు మొదలు పెడుతామని సంబంధిత శాఖ అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. తహసీల్దార్ కూడా సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు మొగులయ్య, దుర్గా ప్రసాద్, అనిల్, రాములు, నర్సింహులు, నారాయణ, దావిద్, అంజనేయులు, శంకరయ్య పాల్గొన్నారు.

పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్
వల్లూరు క్రాంతి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఇతర అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 1: ప్రత్యేక వైకల్య గుర్తింపు(సదరం) కార్డు కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెర్ఫ్ సీఈవో దివ్యాదేవరాజన్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆరోగ్య శాఖ అధికారులతో సదరం శిబిరాలు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై సీఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ..సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. యూడీఐడీ పోర్టల్‌ను మొబైల్‌లో కూడా రిజిస్ట్రేషన్, స్లాట్స్ చేసుకునేలా ఈ నెల నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. సదరం కార్డును కూడా పోర్టల్ ద్వారా అభ్యర్థులకు చేరవేస్తామని చెప్పారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. అభ్యర్థులకు ఎలాంటి అపోహలకు తావులేకుండా అవగాహన కల్పించాలని సూచించారు. పీఎం కుసుం ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామీణ ప్రాంతాల మహిళా సంఘాలను ప్రోత్సహించాలని చెప్పారు. ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తు స్వీకరించి స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఈ కొత్త విధానంతో దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ దవాఖానలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

దవాఖాన వద్ద ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

కంది, మార్చి 1: కోహీర్ మండలం మాద్రి గ్రామానికి చెందిన మహానంది(22) జహీరాబాద్‌లో డెలివరీ అయింది. బాలింతకు తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు శుక్రవారం సంగారెడ్డిలోని వెల్‌నెస్ దవాఖానకు తీసుకొచ్చారు. అడ్మిట్ చేసుకున్న వైద్యులు సర్జరీ చేసి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. శనివారం ఉదయం బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న బాలింత ఎలా చనిపోయిందంటూ ఆందోళనకు దిగారు. చికిత్స కోసం దవాఖానకు వస్తే చంపేశారంటూ యాజమాన్యాన్ని నిలదీశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దవాఖానకు వచ్చి బంధువులను సముదాయించే ప్రయత్నం చేయగా వైద్యుల నిర్లక్ష్యంతో ఆరోగ్యంగా ఉన్న బాలింత చనిపోతే మమ్మల్ని సముదాయిస్తారా అంటూ ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు, మృతురాలి బంధువుల మధ్య తోపులాట జరిగింది. అధిక డబ్బులు వసూలు చేసి ప్రాణం తీశారని కుంటుంబ సభ్యులు కంటతడి పెట్టారు. మరణానికి కారణమైన వైద్యులు, దవాఖాన యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకొని, దవాఖాన లైసెన్సును రద్దు చేయాలని, మృతి చెందిన కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంగారెడ్డి రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సెల్‌టవర్ పనులు నిలిపివేయాలి

జహీరాబాద్, మార్చి 1: జహీరాబాద్‌లోని సాయిరాంనగర్ కాలనీలో నిర్మించతల పెట్టిన సెల్‌టవర్ పనులను నిలిపివేయాలని ఆర్డీవో రాంరెడ్డికి కాలనీవాసులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ. కాలనీలో నిర్మించతలపెట్టిన సెల్‌టవర్‌తో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకుని సెల్‌టవర్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

సమయానికి బస్సులు నడపాలి

నారాయణఖేడ్, మార్చి 1: విద్యార్థుల సమయానికి అనుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్యకు వినతిపత్రం సమర్పించారు. పరీక్షల సమయం కావడంతో సమయానికి బస్సులు నడపని పక్షంలో పరీక్షలకు ఆలస్యంగా వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఆయా రూట్లలో బస్సుల సంఖ్య కూడా పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాధ్యులు శంకర్, విజయ్, నవీన్, విజ్ఞేశ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సహాయం

రామచంద్రాపురం, మార్చి1: నిరుపేద యువతి వివాహానికి ఏకే ఫౌండేషన్ అండగా నిలిచింది. భారతీనగర్ డివిజన్‌లోని బొంబాయికాలనీకి చెందిన సంజయ్ కూతురు శాలిని వివాహం సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖదీర్ తన వంతు సహాయంగా రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకే ఫౌండేషన్ నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. నిరుపేదలకు ఫౌండేషన్ కింద ఎంతో కొంత ఆర్థిక సహకారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, షాబుద్దీన్, అజీమ్, ఆర్తి తదితరులు ఉన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి

సదాశివపేట, మార్చి 1: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద ఆదివారం నిర్వహించే యూపీఎస్‌పై యుద్ధ భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ వీరేశం కోరారు. శనివారం ఎంఆర్వో కార్యాలయ ఆవరణలో యూపీఎస్‌పై యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ధర్నాచౌక్ వద్ద నిర్వహించే యుద్ధభేరిలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ అనంతయ్య, ఉద్యోగులు లింగం, సుజాత పాల్గొన్నారు.

మల్లయోధుడికి నగదును అందజేస్తున్న గ్రామ నాయకులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు

కల్హేర్, మార్చి 1: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన కల్హేర్ గ్రామ శివారులోని భద్రప్ప స్వామి దేవాలయం వద్ద మూడు రోజుల పాటు జాతర కొనసాగింది. చివరి రోజు శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ మండలాలు, జిల్లాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. చివరి పోటీలో కర్ణాటక రాష్ట్రం లాతూర్‌కు చెందిన జరసన్ మల్లయోధుడు గెలుపొందాడు.

దత్తగిరి సేవలు అభినందనీయం

ఝరాసంగం, మార్చి 1: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన సేవలను అఖిలభారత జూనఅఖాడ గర్తించడం అభినందనీయమని బర్దిపూర్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా పేర్కొన్నారు. శనివారం ఆశ్రమంలో పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌లను సన్మానించారు. ఆశ్రమం తరపున కుంభమేళకు వచ్చిన తెలుగు రాష్ట్రాల భక్తులకు సేవలు చేయడం అభినందనీయమన్నారు.

పీఠాధిపతులను సన్మానిస్తున్న దృశ్యం

శాస్త్రవేత్తలుగా తయారు కావాలి

కోహీర్, మార్చి1: విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా తయారు కావాలని ఎంఈవో జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం కోహీర్‌లోని ఇండియన్ పాఠశాల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 50మంది విద్యార్థులు పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మునిపల్లిలో రిజిస్ట్రేషన్లు షురూ

మునిపల్లి, మార్చి1: ఇష్టం వచ్చినప్పుడు రిజిస్ట్రేషన్లు అనే శీర్షిక నమస్తే తెలంగాణలో శనివారం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించి మునిపల్లి తహసీల్ కార్యాలయంలో భూమి అమ్మకం, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్లు షురూ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిత్యం పోరాడి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నమస్తే తెలంగాణ దినపత్రికపై అభినందనల వర్షం కురిపించారు. వారం రోజులుగా మునిపల్లి లో రిజిస్ట్రేషన్లు చెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై వార్తలు రాసి సామాన్య జనాలకు అండగా నిలబడుతున్న నమస్తే తెలంగాణ దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేశ్ గౌడ్

హత్య కేసును ఛేదించిన పోలీసులు

సదాశివపేట, మార్చి 1: హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం సదాశివపేట పోలీసుస్టేషన్‌లో సీఐ మహేశ్‌గౌడ్ విలేకరులతో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మూడు రోజుల క్రితం నందికంది గ్రామానికి చెందిన సార చిన్నలక్ష్మి(39) హత్యకు గురైంది. ఆమె తమ్ముడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నందికంది గ్రామానికి చెందిన చెలిమెడ భాస్కర్(45) లక్ష్మిని హత్య చేసినట్లు గుర్తించారు. భాస్కర్ స్టార్ కెమికల్ ఫ్యాక్టరీ వద్ద రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. 2007లో ముస్లిం మహిళను ప్రేమ వివాహం చేసుకోగా వారికి ఐదుగురు సంతానం. భార్యాభర్తల మధ్య గొడవరావడంతో భార్య సదాశివపేటలో వేరుగా ఉంటుంది. భాస్కర్ మొదటి నుంచే మద్యం తాగుతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. రెండేండ్ల క్రితం మృతురాలు చిన్నలక్ష్మి మేకలు మేపుతూ భాస్కర్ ఉండే ఇంటి వైపు వెళ్లినప్పుడు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారిద్దరూ కలిసి తాగుతూ శారీరక సంబంధం పెట్టుకున్నారు. మృతురాలి కూతురు శిరీష భర్త చనిపోవడంతో కొండాపూర్ మండలం అనంతసాగర్‌లో ఒంటరిగా ఉంటుంది. నిందితుడు భాస్కర్‌కు ఆమెపై కన్నుపడడంతో ఆమెను కూడా పెండ్లి చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నాడు. గతనెల 26న రాత్రి 12 గంటలకు నిందితుడు మహేశ్వరి థియేటర్‌లో సినిమా చూసి వస్తుండగా మృతురాలు లక్ష్మి మద్యం మత్తులో కనిపించింది. ఆమెతో మాట్లాడుతూ నీ కూతురు శిరీషకు భర్త లేనందున మీ ఇద్దరినీ తాను చూసుకుంటానని చెప్పడంతో మృతురాలు లక్ష్మికి కోపం వచ్చి నిందితుడు భాస్కర్‌ను తిడుతూ గ్రామంలోని పెద్దలతో చెప్పి నీ అంతుచూస్తానని బెదిరించింది. దీంతో భాస్కర్ ఆమెను చీరతో ఉరివేసి హతమార్చాడు. తర్వాత ఆమె ఫోన్, మెడలో ఉన్న రోల్డ్ గోల్డ్ పుస్తెలు, చెవి దిద్దులు, పట్టా గొలుసులు దొంగిలించాడు. ఎస్సై పర్యవేక్షణలో డీఎస్పీ ఆధ్వర్యంలో కేసు ఛేదించామని సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలి

రాయికోడ్, మార్చి 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఇందూర్ పీఏసీఎస్ చైర్మన్ హనుమగొండ అన్నారు. శనివారం రాయికోడ్‌లో ఆయన మాట్లాడుతూ..మండల పరిధిలోని ఇందూర్ పీఏసీఎస్ ద్వారా రైతులకు రూ.12కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం రూ.2 లక్షల మాఫీలో భాగంగా పీఏసీఎస్ పరిధిలోని 50శాతం మంది రైతుకు మాత్రమే రూ.కోటి వచ్చిందన్నారు. మిగిలిన 350మంది రైతులకు రూ.2 లక్షలు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు షరతులు లేకుండా అర్హులైన ప్రతి రైతుకూ పంట రుణమాఫీ చేయాలన్నారు. త్వరలోనే రుణమాఫీ కానీ 350 మంది రైతులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రరాయి గనులపై అధికారుల దాడులు

ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

జహీరాబాద్, మార్చి 1: అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రరాయి తవ్వితే చర్యలు తప్పవని జిల్లా భూగర్భ గనుల శాఖాధికారులు హెచ్చరించారు. శనివారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని గణేశ్‌పూర్ గ్రామ శివారులోని నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించిన భూములు, పట్టా, ప్రభుత్వ భూము ల్లో అక్రమార్కులు అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రరాయిని తవ్వుతున్న సమాచారం మేరకు సంబంధిత అధికారులు గనులపై దాడులు చేశారు. ఎర్రరాయి గనుల్లో అక్రమంగా తవ్వకాలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రరాయి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ట్రాక్టర్లను హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడిలో భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలు చెల్లించాలి

హైదరాబాద్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

జహీరాబాద్, మార్చి 1:అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలు అందించాలని సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సకాలంలో వేతనాలను చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులతోపాటు మీని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వారికి పెరిగిన వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి మహిపాల్, నాయకురాలు విజయలక్ష్మి, నాగమణి, గౌరమ్మ, సబితా, శోభా, బుజ్జమ్మ పాల్గొన్నారు.

ఈ విద్యార్థులు కుంగ్‌ఫులో కింగ్స్

అందోల్, మార్చి 1: నేషనల్ ఓపెన్ కుంగ్‌ఫు-కరాటే చాంపియన్‌షిప్‌లో తాలెళ్మ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్నేషనల్ షాలోస్ 2025 కుంగ్‌ఫు, కరాటే వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా కప్-2 సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు బీ.శృతి. సీహెచ్.హిమశ్రీ. ఎన్.సుప్రియ గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం రమేశ్, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

మట్టి టిప్పర్లు సీజ్

గుమ్మడిదల, మార్చి 1: అనుమతి లేకుండా మట్టి టిప్పర్లు జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండడంతో పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. గుమ్మడిదల మున్సిపాలిటీలోని గండిమైసమ్మకు చెందిన మట